జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
సోమవారం | 3 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 3



## ఎమ్మెల్యే రాగమయిని కలిసిన జి ఎం వెంకటాచారి



**సత్తుపల్లి ఆగస్టు02(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన సరికొండ వెంకటాచారి,ఆదివారం సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మాట్టా రాగమయి దయానంద్ ను స్థానిక క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసినారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే,శాలువాతో, ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నూతన బాధ్యతలు చేపట్టినందుకు అభినందనీయమని,సత్తుపల్లి ఏరియా అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గానికి అందించే సింగరేణి సంస్థ ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సహకరించి,ప్రజలకు ఉద్యోగులకు మంచి పరిపాలన అందించాలని కోరారు. ఆమెను కలిసిన వారిలో జి ఎం బొల్లం శ్రీనివాస్,జేవియర్ ఓసి ప్రాజెక్టు ఆఫీసర్ ప్రహ్లాద, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ లు ఉన్నారు.

- నిరుపయోగంగా కనిపిస్తున్న బోనకల్ బస్టాండ్
- యాచకులకు, కుక్కలకు పరిమితమైన బస్టాండ్
- తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
- గత పాలకులు పట్టించుకోలేదు
- ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదు
- బస్టాండ్ సౌకర్యార్థం లేక ప్రయాణికుల ఇబ్బందులు
- ఇకనైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఉపయోగంలో ఉండే విధంగా కృషి చేయాలి
- ముక్తకంఠంతో కోరుతున్న మండల ప్రజలు



# బోనకల్ బస్టాండ్ ఉన్నా లేనట్లే.?

**బోనకల్, ఆగస్టు 02(ప్రజా జ్యోతి):** ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు నేటికీ బోనకల్ బస్టాండ్ గురించి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. లక్షల రూపాయలు పెట్టి కట్టిన బోనకల్ బస్టాండ్ నేటికి ఉపయోగంలో లేకుండా పోయింది. బోనకల్ మండల కేంద్రంలో బస్టాండు ఉన్నా లేనట్లుగా కనిపిస్తుంది. నేటికీ కూడా బోనకల్ బస్టాండు నిరుపయోగంగా కనిపిస్తుంది. దీనితో బస్సు సౌకర్యార్థం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు సౌకర్యార్థం కొరకు నిర్మించిన ఈ బస్టాండ్ లో పిచ్చి చెట్లు మొలచి నిరుపయోగంగా ఉండటంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ బస్టాండ్ నిరుపయోగంగా ఉండటమే కాకుండా శిథిలావస్థకు చేరినట్లు కనిపిస్తుంది.? అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. బోనకల్ మండలంలో 22 గ్రామాలు ఉన్నాయి. 22 గ్రామాల ప్రజలకు ఈ బస్టాండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కానీ ప్రయాణికుల సౌకర్యార్థం కొరకు అధికారులు మాత్రం ఈ బస్టాండ్ గురించి పట్టించుకున్న పాపాన లేదు. ఈ మధ్యనే హడావుడిగా నిరుపయోగంగా ఉన్న ఈ బస్టాండ్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించారు. కాంపౌండ్ వాళ్ళు నిర్మిస్తుంటే మండల ప్రజలు చూసి ఈ బస్టాండ్ ఉపయోగంలో వస్తుందిలే అనుకున్నారు. కానీ కాంపౌండ్ వాళ్ళు నిర్మించారు. ఆ తర్వాత బస్టాండ్ గురించి మాత్రం పట్టించుకోవడం మరిచారు. ఒకప్పుడు ఖమ్మం, మధిర డిపో బస్ సర్వీసులు బస్టాండ్కు వచ్చి వెళ్ళేవి. ఇవి కూడా కొన్ని సంవత్సరాలు మాత్రమే నడిచాయి. ఆ తర్వాత నుండి ఈ బస్టాండ్కు బస్సులు రావడం లేదు. ప్రస్తుతం ఈ బస్టాండ్ నేటికీ ప్రయాణికులకు ఉపయోగపడకుండా యాచకులకు, కుక్కలు పడుకోవడానికి ఉపయోగపడుతుంది. దీనితో ఈ ప్రయాణ ప్రాంగణం శిథిలావస్థకు చేరింది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు 2 – 7– 1988 న నాటి రాష్ట్ర చిన్న తరహా నీటి వనరుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ బస్టాండ్కు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఈ ప్రయాణ ప్రాంగణం బాగానే కొనసాగింది. గత పది సంవత్సరాల నుండి ఈ బస్టాండ్ నిరుపయోగంగా ఉన్నది. గతంలో కొంతమంది పెద్దలు ఈ బస్టాండ్ ను అభివృద్ధి చేయడానికి అభివృద్ధి కమిటీని వేశారు. ఆ తర్వాత బస్టాండ్ అభివృద్ధి కోసం నాటి బిఆర్ఎస్ పాలనలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న మహేందర్ రెడ్డిని కలిశారు. బోనకల్ బస్టాండ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం కొరకు బస్సులు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఆ తర్వాత కొన్ని రోజులు బస్సులు ఈ బస్టాండ్ కు వచ్చాయి. మూడు నాళ్ళ ముచ్చటగా వచ్చాయి. ఆ తరువాత మళ్లీ రాకుండా ఆగిపోయాయి. మండలంలో ఇతర గ్రామాల నుంచి రాకపోకలు సాగించే ప్రజలు బస్సులు, ఆటోలు వచ్చేవరకు ఉండటానికి బస్టాండ్ లేక వర్షాలకు తడుస్తూ, ఎండలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికులకు సౌకర్యార్థాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని తెలుస్తుంది.? నాటి బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో నాయకులు బోనకల్ మండల కేంద్రంలో ఉన్న ఈ బస్టాండ్ ను పట్టించుకున్న పాపాన లేదు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న ఈ బస్టాండ్ వైపు కన్నెత్తి చూడడం మరిచారు. ఇప్పటికైనా ప్రయాణికుల సౌకర్యార్థ గురించి ఆలోచించి నిరుపయోగంలో ఉన్న బోనకల్ బస్టాండ్ ను ఉపయోగంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు బోనకల్ బస్టాండ్ గురించి స్పందిస్తారా లేదా వేచి చూడాలి.?

# వీధి కుక్కల వీరవిహారం

- వీధి కుక్కల వీరవిహారం ప్రాణాలతో చెలగాటమా
- స్పందించండి అధికారులు
- భరణిపాడు గ్రామంలో చిన్నారిని కరిసిన వీధి కుక్క
- తృటిలో తప్పిన ప్రమాదం గాయలతో బయటపడ్డ చిన్నారి

2 లో...



## న్యాయవాదుల రక్షణ,సంక్షేమంపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి,ఎఫ్ఎల్పీ అధ్యక్షుడు దిలీప్ చౌదరి తాళ్లూరి

2 లో...



# నిరుద్యోగి వేణుగోపాల్ ఆత్మహత్య పై భట్టి స్పందించాలి

- అనంతు ఉపేందర్ గౌడ్ , మాజీ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు



**నేలకొండపల్లి, ఆగస్టు 2 ప్రజా జ్యోతి :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హామీల వల్ల ఒక నిరుద్యోగి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది.. ఈ ఆత్మహత్య కు రాష్ట్ర ప్రభుత్వం మే బాధ్యత వహించాలని బీజేవైఎం ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు అనంత ఉపేందర్ గౌడ్ అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లా ముది గొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేణుగోపాల్ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేణుగోపాల్ ఆత్మహత్య చేసుకోవడం విషయం అత్యంత బాధాకరం. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం గా ఉండాలని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను. వేణుగోపాల్ ఆత్మహత్య పరిస్థితులపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి. ఒకవేళ నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగాలపై నిరాశ లేదా ఇతర కారణాలు ఈ ఘటనకు దారితీసి ఉంటే, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ముఖ్యంగా ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ విడుదల వంటి అంశాలపై ఆలస్యం లేకుండా నిర్ణయాలు తీసుకుని, నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలి. యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఉపాధి అవకాశాలు పెంచే చర్యలు చేపట్టాలని కోరారు.

## ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు




**నేలకొండపల్లి, ఆగస్టు 2 ప్రజా జ్యోతి:** ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు మండలం లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సోషల్ మీడియా వేదికగా స్నేహితులకు పలు సందేశాలను పంపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో స్నేహితులు సంబురాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కోరట్లగూడెం లో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ షిఫ్ డే ని నిర్వహించారు. స్నేహితులకు ఫ్రెండ్స్ షిఫ్ బ్యాండ్ కట్టి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు షేక్ సైదా, షేక్ మహబూబ్, పాషా, లాల్పాషా, రావూరి సాయి, కొత్తపల్లి సాయి, గడిపల్లి నవీన్, గుండా అజిత్, షేక్ రాహుల్, మీసాల తేజ, మార్తి భరత్, షేక్ రహీం, బాషా, షేక్ షిలార్, గుండా కోటి, కందికొండ రవితేజ, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని ప్రజలకు వివిధ శాఖల అధికారులు వాట్సాప్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

# వీధి కుక్కల వీరవిహారం

- ప్రాణాలతో చెలగాటమా
- స్పందించండి అధికారులు
- భరణిపాడు గ్రామంలో చిన్నారిని కరిసిన వీధి కుక్క
- తృటిలో తప్పిన ప్రమాదం గాయలతో బయటపడ్డ చిన్నారి



**వేంసూరు జూలై 2 ప్రజా జ్యోతి న్యూస్** విధి కుక్కలు గ్రామాల్లో ఎక్కువైపోయాయి రోడ్డున పోయే జనాలు కరిసి వారి ప్రాణాల మీదకు తెచ్చేటట్టు వీధి కుక్కలు గ్రామాల్లో వీర విహారం చేస్తున్నాయి ఈ సమస్య ప్రతి గ్రామంలో కూడా ఉంది వీటికి సంబంధించి పలు సందర్భాల్లో ప్రజా జ్యోతి అనేకసార్లు వీధి కుక్కలు చేసే డాడీ గురించి రాసింది రాత్రి సమయంలో ప్రయాణం చేసి ప్రయాణికుల మీద ఎగబడి కరవడం మామూలు అయిపోయింది ఇలాంటి కేసులు చాలా ఉన్నాయి గ్రామాల్లో చాలామంది వీధి కుక్కల బారిన పడి హాస్పటల్ పాలు అవుతున్నారు తాజాగా భరణిపాడు గ్రామంలో గుల్లపూడి నర్సింహారావు కూతురు చిన్నారి విద్యభారతి ఆడుకుంటున్న సమయంలో ఒక వీధి కుక్క చిన్నారి చాతి మీద పొట్ట పైన భాగాల్లో కరసి గాయపరిచింది వెంటనే స్పందించిన తల్లిదండ్రులు హఠాత్తుగా వేంసూర్ ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకువెళ్లారు అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రిలో చిన్నారికి చికిత్స అందిస్తున్నారు సరైన సమయానికి హాస్పిటల్కు తీసుకు వెళ్ళటం వల్ల చిన్నారికి ప్రాణంపాయం తప్పింది కానీ తల్లిదండ్రుల ఆందోళనలో ఉన్నారు మేము పనులు చేసుకుంటాం కూలి నాలికి వెళ్లే వాళ్ళము పిల్లలు ఆడుకుంటున్న సమయంలో ఇలాంటి కుక్కలు వచ్చి కరిస్తే దాని పరిష్కారం ఏంటి అసలు వీధి కుక్కలు ఉండవలసిన అవసరం ఏముంది దీనికి అధికారులు స్పందించిన పరిష్కారం చూపించాలని చెప్తున్నారు సమస్య ఎప్పుడు ఉన్నది ఇకనైనా అధికారులు స్పందించి వీది కుక్కల నుంచి విముక్తి కలిగించాలని అంటూ తల్లిదండ్రులు చెప్తున్నారు మరి ముఖ్యంగా కుక్కలు పెంచుకుంటున్న వారు కూడా వాటికి టీకాలు వేయించడం కూడా లేవు అలాంటప్పుడు కుక్కలు పెంచుకోవాల్సిన అవసరం ఏముంది టీకాలు వేయని కుక్కలకు విష ప్రభావం ఎక్కువ ఉండి పిల్లలకు ప్రాణం పోయే పరిస్థితి ఉంటుంది కాబట్టి ఇకనైనాఅధికారులు స్పందించి ఎవరైనా కుక్కలు పెంచుకుంటే ఇంటి దగ్గర కట్టేసుకోవాలి లేదంటే అసలు వీధి కుక్కలు రోడ్లు మీద తిరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు చెబుతున్నారు ఇదే విధంగా గ్రామంలో పలు ప్రాంతాలు ఇలాంటి కుక్కలు దాడి చేస్తున్నాయి మండలంలోని కూడా అనేక ప్రాంతాల్లో ఈలాంటి దాడులు జరుగుతున్నాయి వీటికి సరైన పరిష్కారం చూపించవలసిందిగా అధికారులను గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## న్యాయవాదుల రక్షణ,సంక్షేమంపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి,ఎఫ్ఎల్పీ అధ్యక్షుడు దిలీప్ చౌదరి తాళ్లూరి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ (ఎఫ్ఎల్పీ) వినతి మేరకు లోక్‌సభ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఆర్థిక, వృత్తిపరమైన సమస్యలు, రక్షణ చట్టం మరియు సంక్షేమానికి సంబంధించిన కీలక అంశాలపై పార్లమెంట్‌లో ప్రశ్నను లిఖితపూర్వక సమాధానం కోసం ప్రవేశపెట్టడం హర్షణీయమని ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షుడు దిలీప్ చౌదరి తాళ్లూరి తెలిపారు.ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షుడు దిలీప్ చౌదరి తాళ్లూరి,తెలంగాణ జూనియర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ, ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ కార్యదర్శి మర్రి ప్రకాశరావు, సీనియర్ న్యాయవాది స్వామి రమేష్‌కుమార్ సహకారంతో సమర్పించిన వినతిపత్రంలోని అంశాల ఆధారంగా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఈ ప్రశ్నను పార్లమెంట్‌లో లేవనెత్తారు.ఈ ప్రశ్నలో యువ న్యాయవాదులు ప్రారంభ దశలో ఎదుర్కొంటున్న ఆర్థిక,వృత్తిపరమైన సవాళ్లపై కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందా, కొత్తగా నమోదు అయిన న్యాయవాదులకు నెలవారీ స్టైపెండ్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, లీగల్ ఎయిడ్ సేవలకు ప్రోత్సాహకాలు, వడ్డీలేని విద్యా రుణాలు, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ (కార్పస్) ఫండ్, ఇతర ఆర్థిక సహాయ పథకాలు, అలాగే మానసిక ఆరోగ్య సహాయం, సామాజిక భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించే జాతీయ విధానాన్నిరూపొందించే అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరారు.ఈ ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ 7-08-2026న లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇవ్వనుంది. అదేవిధంగా, లోక్‌సభలో రూల్-377 కింద తెలంగాణ రాష్ట్రానికి సెంట్రల్ నోటరీల నియామకాలు చేపట్టడం,రాష్ట్రానికి కేటాయించిన నోటరీ కోటాను పెంచడం వంటి కీలక అంశాలను కూడా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.న్యాయవాదుల రక్షణ చట్టం,సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి సంబంధించిన ఈ కీలక అంశాలను దేశ అత్యున్నత శాసనసభలో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వ స్పందనను కోరిన ★ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి కి ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందనలు తెలిపింది. అలాగే ఈ కార్యక్రమానికి విశేష సహకారం అందించిన సీనియర్ న్యాయవాది ★స్వామి రమేష్‌కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.న్యాయవాదుల రక్షణ, సంక్షేమం, సామాజిక భద్రత మరియు వృత్తిపరమైన అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ ప్రయత్నాలు దేశవ్యాప్తంగా యువ న్యాయవాదులకు ప్రయోజనం చేకూర్చే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ అభిప్రాయపడిందని అధ్యక్షుడు దిలీప్ చౌదరి తాళ్లూరి పేర్కొన్నారు.

## మరీదు స్వామికి సిపిఐ ఘన నివాళి

- నివాళులర్పించిన సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



**బోనకల్, ఆగస్టు 02 (ప్రజా జ్యోతి):** మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సీనియర్ సభ్యుడు మరీదు స్వామి (68) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతికి సీపీఐ నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మృతదేహంపై పార్టీ పతాకాన్ని కప్పి ఘనంగా నివాళులర్పించారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి వంగాల కృష్ణ, వంగాల నారాయణ, వంగాల బ్రహ్మం, వంగాల నాగేశ్వరరావు, గుడిద పెద్ద వెంకటేశ్వర్లు, మరీదు శ్రీను, మరీదు నాగేశ్వరరావు, రాము, వార్డు సభ్యుడు మంద వెంకట్రావమ్మ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన, సర్పంచ్ బొగ్గులు గోవర్ధన్ రెడ్డి



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మధిరలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్ నందు, వెంకటాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న రేగళ్ల రామారావు -కనకదుర్గ ల కుమార్తె చి. లక్ష్మీ రోహిత ఓణీల కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి వెంకటాపురం సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి వేడుకకు హాజరై చిరంజీవిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి మధిర టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వరరావు ఎర్రుపాలెం మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి సుధాకర్ రెడ్డి రాజుపాలెం సొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి సొసైటీ డైరెక్టర్లు బూసిపల్లి వెంకటరెడ్డి కర్నాటి రామకోట రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ శీలం వెంకటరామిరెడ్డి వేమిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

# ప్రజల కోసం జీవించిన నాయకుడు ప్రకాష్ రావు

- తూము ప్రకాశరావు జ్ఞాపకార్థంగా 71వ ఉచిత, బీపీ షుగర్ వైద్య శిబిరం విజయవంతం



**బోనకల్, ఆగస్టు 02 (ప్రజా జ్యోతి):** ప్రజల కోసం జీవించి, ప్రజల కోసమే అమరుడైన తూము ప్రకాశరావు ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన పోరాట బాటనే సమసమాజ నిర్మాణానికి మార్గమని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్‌లో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల నిర్వహించే 71వ ఉచిత బీపీ, షుగర్ ప్రత్యేక వైద్య శిబిరం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. శిబిరంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ... నేటి మధిర ప్రాంత అభివృద్ధి వెనుక కమ్యూనిస్టు ఉద్యమాల త్యాగగాథ దాగి ఉందన్నారు. పేదలు, వ్యవసాయ కూలీలు, దళితుల హక్కుల కోసం తూము ప్రకాశరావు నిరంతరం పోరాడారని, ఆయన జీవితం ప్రజా ఉద్యమాలకు ఆదర్శమని కొనియాడారు. కలకోట, రాయన్నపేట గ్రామాల్లో ఎస్సీ కాలనీల ఏర్పాటు, దళితులకు చేపల సొసైటీ హక్కులు కల్పించడం, భూపోరాటాల ద్వారా కలకోట, రాయన్నపేట, ఆళ్లపాడు, సిలిపురం మల్లవరం గ్రామాల్లో బంజరు భూములను పేదలకు పంపిణీ చేయించడంలో తూము ప్రకాశరావు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన పోరాట స్ఫూర్తిని సహించలేని పెత్తందారీ శక్తులు కుట్రపూరితంగా హత్య చేసినప్పటికీ, ఆయన ఆశయాలను మాత్రం అంతం చేయలేకపోయాయని అన్నారు. ప్రకాశరావు అమరత్వానికి 43 సంవత్సరాలు పూర్తవుతున్నా ప్రజల గుండెల్లో ఆయనకు చెరగని స్థానం ఉండటం ఆయన చేసిన సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. యువత సామాజిక బాధ్యతను గుర్తించి ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని, తూము ప్రకాశరావు ఆశయాలను ఆచరణలో కొనసాగించాలని పిలుపునిచ్చారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ సదానందం, డాక్టర్ మధుసూదన్ సుమారు 100 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి నెల రోజుల పాటు సరిపడే నాణ్యమైన మందులను ఉచితంగా అందజేశారు. గ్రామీణ ప్రజలకు ప్రతి నెలా అందుతున్న ఈ ఉచిత వైద్య సేవలను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీడబ్ల్యూఏ–టీఎస్ జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండల రావు, సీపీఐ నాయకులు ఆకెన పవన్, జానకీపురం మాజీ సర్పంచ్ చిలకా వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు దుగ్గి భద్రయ్య, క్యాంపు సహాయకులు గిరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు సరైన గౌరవం దక్కాలి

- బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు




**నేలకొండపల్లి, ఆగష్టు 2 ప్రజా జ్యోతి:** తెలంగాణ ఉద్యమకారులకు సరైన గౌరవం దక్కాలని నేలకొండపల్లి బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు కోరారు. 1969 నుంచి నేటి వరకు తెలంగాణ ఉద్యమంలో అనేక ప్రజాసంఘాలు పనిచేశాయి. అవి ప్రజలను కూడగట్టి, ఉద్యమాన్ని సజీవంగా నిలబెట్టాయి. త్యాగాలు చేశాయి. నెత్తురు ధారపోశాయి. ఈ పునాదిపై నిర్మాణమైన రాజకీయ పార్టీలు ఓట్లు దండుకుంటున్నాయి. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఇంతటి పాత్ర నిర్వహించిన ప్రజా సంఘాల చరిత్రను విస్మరించి దశాబ్దకాలం పాలించిన కేసీఆర్ గానీ, రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం గానీ ఉద్యమకారులకు దక్కాల్సిన గౌరవాన్ని ఇవ్వలేదు. ఇంకా కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ వారిని అవమానపరచటం శోచనీయం. ప్రతి సందర్భంలో పోరాడే శక్తులు కనుమరుగైనట్లే తెలంగాణ ఉద్యమంలో కూడా ఉద్యమకారులకు పార్లమెంటరీ పార్టీలు అన్యాయం చేశాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం కూడా అవే పరిస్థితులు నికార్సయిన ఉద్యమకారులకు ఎదురవుతున్నాయి. ఈ పరిణామాలతో తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర కనుమరుగు చేసే ప్రమాదం ఉంది. తెలంగాణ ఉద్యమకారులు అప్రమత్తంగా ఉంటూ సమగ్ర తెలంగాణ చరిత్రను నిర్మాణం చేసే బాధ్యతను తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ముందు తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కమిటీ పలు న్యాయమైన డిమాండ్లను ఉంచుతున్నది. అవి – తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని, మూడు దశల తెలంగాణ ఉద్యమకారుల చరిత్రను రికార్డు చేయాలి. ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్షతో అమరత్వం పొందిన ఉద్యమ అమరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. వీరి సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటుచేయాలి. తెలంగాణ ప్రజాఫ్రంట్ మాజీ అధ్యక్షులు ఆకుల భూమయ్య హత్యకు కారణమైన వారిని గుర్తించి, శిక్షించాలి. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షకు బలమైన ఊతం అందించిన వరంగల్ డిక్లరేషన్ సభలో ప్రవేశపెట్టిన అంశాలు అమ లయ్యేలా చూడాలి. ఉద్యమంలో అమరత్వం పొందిన వారి స్మారక స్థూపాలను ప్రభుత్వమే అధికారికంగా నెలకొల్పాలి. తెలంగాణ పోరాటంలో విద్యార్థి, ఉద్యమ కారులపై నమోదైన 'ఊపా' తదితర కేసులను వెంటనే ఎత్తివేయాలి. 'ఎన్ఐఏ' తరహా దాడులను అరికట్టి రాజకీయ ఖైదీల విడుదలకు ప్రభుత్వం పూనుకోవాలి. తొలితరం ఉద్యమ శిఖరం, తెలంగాణకు దీపస్తంభం వంటి వరవరరావుని తెలంగాణకు తీసుకు వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలలో అమరవీరుల స్మారక స్థూపాలను నిర్మించి అధికారికంగా శ్రద్ధాంజలి ఘటించాలి. విభజనను వ్యతిరేకించిన వ్యక్తుల గుర్తులను తెలంగాణలో తొలగించాలి. తెలంగాణ భాషను, సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి. తెలంగాణ అస్తిత్వానికి భంగం వాటిల్లకుండా చూడాలి.

## ప్రజా పోరాటాలకు యువత సిద్ధం కావాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు




**నేలకొండపల్లి, ఆగస్టు 2 ప్రజా జ్యోతి :** ప్రజా పోరాటాలకు యువత సిద్ధం కావాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రావెళ్ల సత్యనారాయణ భవనంలో డివైఎఫ్ఐ మండల కమిటీ సమావేశం సంఘం మండల కార్యదర్శి లోడుగు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బొడ్డు మధు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు కేవీరెడ్డి, డివైఎఫ్ఐ డివిజన్ అధ్యక్షురాలు భూక్య వనజ రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు మాట్లాడుతూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కార్మికులు, రైతులు, యువజనులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నా దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఢిల్లీ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, విద్యా–ఉపాధి అవకాశాల కొరత, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి సమస్యలపై జిల్లా వ్యాప్తంగా యువత ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తును కాపాడుకోవాలంటే ప్రజా సమస్యలపై జరుగుతున్న పోరాటాల్లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం, ఉద్యోగాల భర్తీ, విద్యా హక్కు, సామాజిక న్యాయం సాధన కోసం జరిగే పోరాటాలలో యువత అగ్రభాగాన నిలవాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు కేవీ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా వినిపించిన ప్రజల గొంతుకను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆలకించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, యువత భవిష్యత్తు, ప్రజాసంక్షేమం కోసం ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న "జైలు భరో" కార్యక్రమంలో యువత, మహిళలు, వ్యవసాయ కార్మికులు, అన్ని రంగాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డివైఎఫ్ఐ డివిజన్ అధ్యక్షురాలు భూక్య వనిజ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారానే ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రజలకు న్యాయం సాధించవచ్చని నాయకులు పేర్కొన్నారు. యువత సామాజిక బాధ్యతతో ప్రజా పోరాటాలలో విస్తృతంగా పాల్గొనాలని ప్రజా ఉద్యమాలకు సంపూర్ణంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు బొడ్డు సెలవరాజ్, మండల కమిటీ సభ్యులు దేగల హరిప్రసాద్, టి ప్రవీణ్, పి నవీన్, కళ్యాణ్, భార్గవ్, వంశి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రుపాలెం మోడ్రన్ కబడ్డీ అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లికార్జున్ రెడ్డి, బి గోపి.




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మధిర ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మోడ్రన్ కబడ్డీ సమావేశంలో మోడ్రన్ కబడ్డీ జిల్లా చైర్మన్ దేవరాజు, జిల్లా సెక్రెటరీ ఈ రంగారావు, ట్రెజరర్ కృష్ణ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం మోడ్రన్ కబడ్డీ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఎర్రుపాలెం మండల అధ్యక్షుడిగా కుడుముల మల్లికార్జున్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భూక్య గోపి, ఉపాధ్యక్షులు జి గోపయ్య, సహాయ కార్యదర్శిగా వేణు, ట్రెజరర్ ఎస్.కె జహీరా, సభ్యులుగా శీలం బాలకృష్ణారెడ్డి, బి మహేష్, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది

## రేగా కాంతారావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

- లేనిపక్షంలో మహిళలతో కలిసి ఆందోళన చేపడతాం: మహిళా సర్పంచ్‌లు
- సర్పంచ్ ధీరావత్ అశోకరాణి.



**నేలకొండపల్లి, ఆగస్టు 2 ప్రజా జ్యోతి:** మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మంగాపురం సర్పంచ్ ధీరావత్ అశోకా రాణి మహిళా నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపై బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం వెంటనే స్పందించి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మహిళల గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకుల విషయంలో పార్టీ స్పష్టమైన వైఖరి అవలంబించాలని అన్నారు. చట్టపరమైన విచారణకు పూర్తి సహకారం అందించడంతో పాటు పార్టీ కూడా తన స్థాయిలో బాధ్యతాయుత నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మహిళలపై జరిగే వేధింపుల విషయంలో ఎవరిపట్లా వివక్ష చూపరాదని, గతంలో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న ప్రజాప్రతినిధులపై తీసుకున్న చర్యల మాదిరిగానే రేగా కాంతారావు విషయంలోనూ ఒకే ప్రమాణాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు మహిళలకు ఆదర్శంగా ఉండాలని, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని తేలికగా తీసుకోవడం సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే మండల వ్యాప్తంగా మహిళలను ఏకతాటి పైకి తీసుకువచ్చి నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు నిర్వహిస్తామని మహిళా మహిళా నాయకులు హెచ్చరించారు.